




# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

శనివారం | 05 జూలై 2025

పేజీలు 8


# తెదేపాలో భగ్గుమన్న విభేదాలు

2లో

- మాజీ మంత్రి ఏరాసు పై భౌతిక దాడికి పాల్పడ్డ తెలుగుతమ్ముళ్లు
- మెజారిటీ నియోజకవర్గాల్లో కొనసాగుతున్న వర్గపోరు
- పట్టించుకోని అధిష్టానం మిగిలిన చోట్లా ఆత్మకూరు
- సంఘటన పునరావృతమైతే పార్టీ ఇమేజ్‌కు పెద్ద దెబ్బే..

కర్నూలు, మేజర్‌న్యూస్ బ్యూరో

అధికార తెలుగుదేశం పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. నివురు గప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి వీధికెక్కింది. ఉమ్మడి కర్నూలు జిల్లా శ్రీశైలం నియోజకవర్గ కేంద్రమైన ఆత్మకూరులో తెదేపాలోని ఒక వర్గం మరో వర్గంపై ప్రత్యక్షంగా దాడులకు దిగింది. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అనుచరు లుగా చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు మాజీ ఎమ్మెల్యే ఏరాసు ప్రతాపరెడ్డి ఇంటిపై దాడికి దిగారు. ఆయనపై కూడా దాడి చేశారు. శుక్రవారం ఆత్మకూరుకు వెళ్లిన నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి నేరుగా ఏరాసు ఇంటికి వెళ్లడం నచ్చని వర్గం ఈ దుశ్చర్యకు పాల్పడింది. ఇప్పటికే మెజారిటీ నియోజకవర్గాల్లో తెదేపాలో వర్గపోరు జరుగుతోంది. ఇంత కాలం చాప కింద నీరులా ఉన్న అసంతృప్తి కొట్టుకునేంత వరకు రావడం చూస్తుంటే పరిస్థితి ముదిరి పాకాన పడ్డట్లుగా ఉంది. ఇప్పటికే తెదేపా ప్రజాప్రతినిధులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతుండగా తాజాగా ఆత్మకూరులో చోటు చేసుకున్న సంఘటన రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించింది.

## ఆత్మకూరులో హైటెన్షన్

- మాజీ మంత్రి ఏరాసు ఇంటి పై ఎమ్మెల్యే వర్గీయుల దాడి
- టీడీపీలో బయటపడ్డ వర్గ విభేదాలు
- ఎంపి శబరిని అడ్డుకున్న ఎమ్మెల్యే వర్గీయులు
- ఏరాసు గో బ్యాక్ అంటూ నినాదాలు
- కార్యక్రమంలో పాల్గొనకుండానే వెనుదిరిగిన ఎంపి శబరి




2లో

మాజి మంత్రి ఏరాసు ఇంటి అద్దాలు పగలగొట్టిన దృశ్యం

## గంగమ్మ చెరువు ఆక్రమణలను తొలగించండి

- 2021లో చెరువులో ఆక్రమణ
- రికార్డులున్నాయంటూ సహకరించిన అధికారులు
- నేషనల్ గ్రీన్‌ట్రైబ్యునల్‌ను ఆశ్రయించిన ఎదురూరు రాజవర్ధన్‌రెడ్డి
- తీర్పు వెలువరించిన ఎన్‌జిటి

కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో : కర్నూలు నగరానికి సమీపంలోని తాండ్రపాడు వద్ద గంగమ్మ చెరువు ఆక్రమణలను తొలగించాలని నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ శుక్రవారం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. 70 ఎకరాల పరిధిలో విస్తరించిన మిగతా 7లో




## తుంగభద్ర జలాశయం నుండి కొనసాగుతున్న వరదనీరు

- 21 గేట్ల ద్వారా 63 వేల క్యూసెక్కుల నీరు విడుదల

హొళగుంద,మేజర్‌న్యూస్ః కర్ణాటక విజయనగర (హోస్పేట్) జిల్లా కేంద్రంలో ఉన్న తుంగభద్ర జలాశయం నుండి నదికి నీరు కొనసాగుతుంది. శుక్రవారం 21 గేట్లు ద్వార రెండున్నర అడుగుల మేర 63 వేల క్యూసెక్స్‌ల నీటిని నదికి విడుదల చేశారు.డ్యాం గరిష్ఠ నీటి మట్టం 105.788 టీఎంసీల నీటి సామర్థ్యం గాను,75.838 మిగతా 2లో



విద్యుత్ కాంతులతో డ్యాం గేట్ల నుండి నదికి పారుతున్న నీరు

## ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

- అశోక్ నగర్ లో పర్యటించిన మంత్రి టి.జి భరత్



2లో

ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి టిజి. భరత్

## అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రజలకు సేవలు చేద్దాం

కర్నూలు జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ బి.నవ్య




6లో

నివాళులర్పిస్తున్న ఇంఛార్జీ కలెక్టర్ బి.నవ్య

## శ్రీశైలం డ్యాంకు భారీగా వరద..

- త్వరలో డ్యామ్ గేట్లు ఎత్తివేత
- జూరాల నుంచి 1,24,610 క్యూసెక్కుల నీరు
- 876.30 అడుగులకు చేరిన డ్యామ్ నీటిమట్టం
- రెండు జల విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుత్ ఉత్పత్తి

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** కృష్ణానది పరివాహక ప్రాంతమైన జూరాల ప్రాజెక్టు నుండి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరువచ్చి చేరుతోంది.ఎగువన కురిసిన వర్షాల కారణంగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది.దీంతో శ్రీశైలం జలాశయానికి గతంలో ఎన్నడు లేని విధంగా మే నెలలోనే నీటి చేరిక ప్రారంభమైంది. ప్రవహిస్తున్న వరద నీరు కారణంగా డాం నీటిమట్టం వేగంగా పెరుగుతూ పూర్తిస్థాయికి చేరువులో ఉంది.డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం885 అడుగులు ..నీటి నిల్వ సామర్థ్యం215.8070 టీఎంసీలు.కాగా శుక్రవారం సాయంత్రం 6గంటల సమయానికి నీటిమట్టం 876.30 అడుగులకు చేరుకుంది.ఇదే సమయానికి జూరాల ప్రాజెక్టు నుండి 1,24,610 మిగతా 2లో



శ్రీశైలం డ్యాం వెనుక భాగం దృశ్యం

# తెదేపాలో భగ్గుమన్న విభేదాలు

(మొదటి పేజి తరువాయి)

తెదేపాలో మొదటి నుండి వర్గ విభేదాలు కొనసాగుతూ వస్తుండడం రివాజుగా మారింది. 2019లో అధికారంలోకి వచ్చిన సమయంలోనూ వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఒకే నియోజక వర్గంలో రెండు మూడు వర్గాలుంటాయంటే ఆశ్చర్య పోవలసిన అవసరం లేదు. అధిష్టానమే ప్రతి నియోజకవర్గంలోనూ రెండు వర్గాలను ప్రోత్సహిస్తుందన్న అపవాదు కూడా లేకపోలేదు. భగ్గుమనే వర్గ విభేదాలపై అధిష్టానం ఏనాడూ జోక్యం చేసుకుంటున్నట్లు కూడా కనిపించదు. ఇప్పుడు ఆత్మకూరులో సంఘటనతో పార్టీలో క్రమశిక్షణ ఎంత చక్కగా ఉందన్నది స్పష్టమైంది. మాజీ మంత్రి ఏరాసు ఇంటిపై దాడి చేసి ఆయన పై భౌతికంగా దాడి చేశారు తెదేపాలోని ప్రత్యర్థి వర్గం. నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి ఎదురుగానే ఈ దాడికి పాల్పడడం ఇది పక్కా ప్రణాళికాబద్ధంగానే జరిగిందన్నది స్పష్టమవుతోంది. బైరెడ్డి శబరి ఆత్మకూరులో తెదేపా కార్యాలయానికి రాకుండా ఏరాసు ఇంటికి వెళ్లడాన్ని బుడ్డా వర్గం జీర్ణించుకోలేక ఈ దాడికి పాల్పడిందని అంటున్నారు. ఆత్మకూరులో ట్రైసైకిల్స్ పంపిణీకి వెళుతున్న తనను తన ఇంటికి అల్పాహారానికి రావాలని ఆహ్వా నించిన మాజీ మంత్రి ఏరాసు బుడ్డాను కూడా ఆహ్వానించారని, తాను కూడా ఆయనకు ఈ విషయాన్ని తెలియజేశానని, తనను తెదేపా పార్టీ కార్యాలయానికి రావాలని ఎవరూ పిలువలేదని బైరెడ్డి శబరి 'మేజర్‌న్యూస్'కు చెప్పారు. సీనియర్ రాజకీయ నాయకుడిపై ఇలాంటి దాడి జరగడం సరైంది కాదని ఆమె అన్నారు.

నందికొట్కూరు నియోజకవర్గంలోనూ రెండు వర్గాల మధ్య విభేదాలున్నాయి. మునిసిపల్ పాలకవర్గంలో ఇవి బహిర్గతమయ్యాయి. తమకో మాట కూడా చెప్పకుండా మునిసి పల్ చైర్‌పర్సన్‌ను బైరెడ్డి రాజశేఖరరెడ్డి తెదేపాలో చేర్చుకోవడాన్ని మరో వర్గం జీర్ణించుకోలేక పోతోంది. ఈ అసంతృప్తి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేంత వరకు వెళ్లింది. వ్యవహారం టీ కప్పులో తుఫాన్‌లో చల్లబడ్డా ఎప్పుడు ఎలాంటి పరిస్థితి సృష్టిస్తుందోనన్న ఆందోళన అయితే తెదేపాలో ఉంది. పత్తికొండ నియోజకవర్గంలలోనూ పార్టీలో వర్గ విభేదాలు కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్నాయి. ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డికి వ్యతిరేకంగా మరో వర్గం ఒంటి కాలుపై నిలుచుంది. ఇటీవలే తెదేపాకు చెందిన కౌన్సిలర్ ఆ పార్టీని వీడి భాజపాలో చేరడం నియోజకవర్గంలో అసంతృప్తి ఎంతలా ఉందన్నది స్పష్టం చేసింది. మరి కొందరు కూడా పార్టీని వీడతారన్న ప్రచారం జరుగుతోంది. దీనికి జయనాగేశ్వరరెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టలేకపోతున్నారు. ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియపై పార్టీలో అసంతృప్తి వర్గం భగ్గుమంటోంది. ప్రస్తుతానికి తెర ముందు నోరు మెదిపేందుకు సాహసించలేకపోయినా ఆమె భర్త తీరుపై కార్యకర్తలు గరంగరంగా ఉన్నారన్నది చాలా సందర్భాలు స్పష్టం చేస్తున్నాయి. డోన్‌లో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి ధర్మవరం సుబ్బారెడ్డి నుండి ఇబ్బందులు తప్పడం లేదు. ధర్మవరం సుబ్బారెడ్డి ప్రత్యేక వర్గాన్ని కొనసాగిస్తున్నారు. మెజారిటీ నియోజకవర్గాల్లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఆత్మకూరు సంఘటనను ఆదర్శంగా తీసుకుని ఒకరిపై ఒకరు ప్రత్యక్షంగా దాడులకు తెగబడితే మాత్రం పార్టీకి ప్రజల్లో ఉన్న ఇమేజ్ దెబ్బతినే ప్రమాదం ఉంది.

# ఆత్మకూరులో.. హైటెన్షన్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** శ్రీశైలం నియోజకవర్గ కేంద్రం ఆత్మకూరులో టిడిపి వర్గ విభేదాలు భగ్గుమనడంతో హైటెన్షన్ వాతావరణ నెలకొనింది. ఎమ్మెల్యే అనుచరులు ఎంపిని అడ్డుకోవడంతో మాజి మంత్రి ఏరాసు, ఎమ్మెల్యే అనుచరుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఆత్మకూరు పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలోదివ్యాంగులకుపరికరాలు పంపిణీ చేసేందుకు అధికారులు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ఎంపిఓ బైరెడ్డి శబరి పాల్గొనాల్సి ఉంది. అయితే ఎంపి బైరెడ్డి శబరి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆత్మకూరుకు వచ్చి పార్టీ కార్యాలయానికి వెళ్ళకుండా మాజి మంత్రి ఏరాసు ప్రతాప రెడ్డికి వెళ్లారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమంలో భాగంగా ఎంపి శబరి ఆత్మకూరులో ఏరాసు వర్గీయులతో కలిసి పర్యటించారు. ఇది గమనించిన ఎమ్మెల్యే వర్గీయులు ఎమ్మెల్యే అనుమతి లేకుండా మీరేలా పర్యటిస్తారంటూ ఎంపిని అడ్డుకున్నారు. నేను ఎంపిని ఎక్కడైన పర్యటించే హక్కు తనకుందంటూ వాధించినా ఎమ్మెల్యే అనుమతి లేకుండా పర్యటించరాదంటూ అడ్డుకోవడంతో కార్యక్రమాన్ని నిలిపివేసింది. దీనికంతటికి కారణం ఏరాసు ప్రతాప రెడ్డినే అని ఎమ్మెల్యే వర్గీయులు మండిపడుతూ ఏరాసు ఇంటిపి రాళ్ళ దాడికి పాల్పడడంతో ఏరాసు, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఏరాసు గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తు గందరగోళం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద ఎత్తున ఏరాసు ఇంటి వద్దకు చేరుకొని ఘర్షణను అదుపు చేశారు. అప్పటికే ఏరాసు ఇంటి కిటికి అద్దాలు,ఫర్నీచర్‌ను ఎమ్మెల్యేవర్గీయులుధ్వంసంచేశారు. పోలీసులు ఇరు వర్గీయులకు నచ్చ చెబుతూ ఘర్షణ సద్దు మణిగేలా చేశారు. నియోజకవర్గంలో సంబంధం లేని వ్యక్తులతో వచ్చి ఎంపి ప్రచారం ఎలా చేస్తారని, ఎంపిడిఓ కార్యాలయంలో జరిగే దివ్యాంగుల పరికరాల పంపిణీలో కూడా ఎంపిని పాల్గొనకుండా అడ్డుకుంటామని ఎమ్మెల్యే వర్గీయులు భీష్మించి కూర్చున్నారు. ఎంపిడిఓ కార్యలయం వద్ద పోలీసు బలగాల మోహరించాయి. ఇదిలా ఉంటే ఎంపి శబరి తాను ప్రోటో కాల్ ప్రకారం తాను దివ్యాంగుల పరికరాల పంపిణీకి వచ్చాను కార్యక్రమంలో పాల్గొనే వెళ్తానని భీష్మించి కూర్చున్నట్లు సమాచారం. హైకమాండ్ ఏమి ఆదేశించిందో ఏమో తెలియదని కాని కార్యక్రమంలో పాల్గొనకుండానే ఆత్మకూరు నుంచి ఎంపి వెనుతిరిగి వెళ్ళా పోయారు.



ఏరాసు ఇంటి వద్దకు చేరుకున్న టిడిపి నాయకులను నివారిస్తున్న పోలీసులు

# నందవరం అభివృద్ధికి అందలం ఎక్కిస్తాం ..ఎమ్మెల్యే బీవీ

**-పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన -వెలుగు కార్యాలయం ఆరంభం**

**నందవరం, మేజర్ న్యూస్ :** నందవరం మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. నందవరం మండల కేంద్రంలో సుపరిపాలన తొలగడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు కేజీబీవీ నూతన భవనాన్ని శిలాఫలక ఆవిష్కరణ చేశారు. అలాగే జడ్పీ హైస్కూల్ భవనాలను పరిశీలించి, నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. అలాగే వెలుగు నూతన కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నామన్నారు. భవిష్యత్తులో చేపట్టే సంక్షేమ కార్యక్రమాల గురించి, రాష్ట్ర అభివృద్ధి గురించి ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. నందవరం మండలంలోని ఉన్న ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని, మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు శ్రీరాములు, మండల కన్వీనర్ ఖాసిం వలి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య, టిడిపి మండల నాయకులు నాగరాజుగౌడ్, ధర్మపురం గోపాల్, కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

# శ్రీశైలం డ్యాంకు భారీగా వరద..

(మొదటి పేజి తరువాయి)

క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. రిజర్వాయర్లో పూర్తిస్థాయి నీటి నిల్వలు ఉండటంతో రెండు జల విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నారు.ఆంధ్ర పరిధిలోని కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో గడిచిన 24 గంటల వ్యవధిలో 14,428 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు.అలాగే తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో17.498 మిలియన్ యూనిట్ల విద్యుత్ను ఉత్పత్తి చేశారు. జలాశయం బ్యాక్ వాటర్ ద్వారా కుడిగట్టు జల విద్యుత్ కేంద్రానికి26,140 క్యూసెక్కులు ఎడమ గట్టు విద్యుత్ కేంద్రానికి 34,926 క్యూసెక్కులు,మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి292 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.నీటి ఆవిరి రూపంలో 188 క్యూసెక్కుల నీరు ఆవిరైంది. ప్రస్తుతం జలాశయంలో 169.8650 క్యూసెక్కుల నీరు నిల్వగా ఉంది.విద్యుత్ ఉత్పత్తి ద్వారా 56,998 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జున సాగర్ కు విడుదల చేశారు. వస్తున్న వరద కారణంగా మరో నాలుగు రోజుల్లో జలాశయం పూర్తిస్థాయిలో నిండుతోంది. వస్తున్న వరద నీటిని అంచనా వేస్తూ రెండు జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి ద్వారా విడుదలవుతున్న నీటి ఆధారంగా త్వరలోనే డ్యామ్ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసేందుకు అధికారులు సంసిద్ధమవుతున్నారు.

## తుంగభద్ర జలాశయం నుండి కొసాగుతున్న వరదనీరు

(మొదటి పేజి తరువాయి)

టీఎంసీల నీటి నిల్వ ఉంది.1633 అడుగుల పూర్తి నీటి మట్టం గాను 1624.80 అడుగులకు చేరింది.ఇన్‌ఫ్లో 27,441 క్యూసెక్స్ నీరు డ్యాంకు చేరుతుంది.డ్యాం గేట్లుకు విద్యుత్ దీపాల ఆలమర్చడంతో విద్యుత్ కాంతులతో నదికి నీరు పారుతుంది.

# ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** తమ ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్‌అన్నారు.కర్నూలు నగరంలోని 45వ వార్డు అశోక్ నగర్ లో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులతో మాట్లాడి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఏఏ పథకాలు అందుతున్నాయో వివరాలు అడిగారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కింది స్థాయి నుండి పై స్థాయి నాయకుల వరకు అందరం ఇంటింటికి తిరిగి ఏడాది పాలనను ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేసిన మంచి పనులు వివరించి ప్రజలు ఏమైనా సమస్యలు చెబితే తెలుసుకొని పరిష్కరించే దిశలో ముందుకు వెళ్తున్నాం అన్నారు. మాటిచ్చిన విధంగా అన్ని హామీలు నెరవేరుస్తున్నట్లు చెప్పారు. త్వరలో మరిన్ని పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కర్నూలు నగరంలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు ప్రధానంగా మెడికల్ కాలేజీ ఎదురుగా రోడ్డు చిన్నగా ఉన్న నేపథ్యంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఈ విషయంలో ఇప్పటికే సంబంధిత దుకాణాల యజమానులతో మాట్లాడినట్లు చెప్పారు. నెలకు రూ.300ల అద్దె చొప్పున 25 సంవత్సరాల వరకు షాపులు కేటాయించి, ఆ తర్వాత మళ్లీ వారికే కేటాయించేలా రెన్యువల్ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చిన డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు అలాగే చైతన్య నగర్ లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్ కు ప్రహరీ గోడ ఏర్పాటు చేస్తానని టి.జి భరత్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు ధరూర్ జేమ్స్, ముంతాజ్, సంజీవలక్ష్మి, సీనియర్ నాయకులు ఆకేపోగు ప్రభాకర్, కార్పొరేటర్లు మాణిక్యమ్మ, పరమేశ్, మాజీ కార్పొరేటర్ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం పండుగను ప్రశాంతాంగా జరుపుకోవాలి



**గోనెగండ్ల,మేజర్ న్యూస్:** మొహరం పండుగను మండలంలోని ప్రజలుకులమతాలకు అతీతంగా ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ విజయభాస్కర్ కోరారు. వేడుకలను జరుపుకునేందుకు గాను ఆయా గ్రామాల ప్రజలు పోలీసులు దగ్గర అనుమతి తీసుకోవాలన్నారు. చిన్నసరిగెత్తు, పెద్ద సరిగెత్తు సందర్భంగా అలాయి గుంతల దగ్గర చిందులకు వేసేటప్పుడు నిప్పులతో వేయరాదని, అలాయి గుంతలలో పచ్చని చెట్లను నరికి కొమ్మలను అందులో వేయరాని ఆయన సూచించారు. ఆయా గ్రామాల్లో ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలని పోలీసులు సూచించారు.ఘర్షణలకు పాల్పడిన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపైకఠిన చర్యలు తీసుకుంటామని సీఐతెలిపారు.నిబంధనలప్రకారంప్రార్ధనలుజరుపుకోవాలని సూచించారు.

## గ్రామాల పరిశుభ్రతే అభివృద్ధికి మూలం-ఎంపీడీఓ రాణెమ్మ

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :**

గ్రామాలు పరిశుభ్రత కలిగిన గ్రామలే అభివృద్ధికి మూలమని ఎంపీడీఓ రాణెమ్మ పేర్కొన్నారు.శుక్రవారం మండల పరిధిలోని కొత్తకోట,సింగవరం, పల్దొడ్డి, సంగాల గ్రామలలో పర్యటించిన ఎంపీడీఓ డంపింగ్ యడ్లను పరిశీలించిన అనంతరం అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్నం భోజనమును పరిశీలించారు.ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలలో రోజు పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు.లేగసి వ్యర్థలను ఎప్పటికప్పుడు డంపింగ్ యాడ్ కు తరలించాలని సూచించారు.ఈకార్యక్రమం మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ రాణెమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ సైఫుల్లా బేగ్, కొత్తకోట హరి తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బందికి తాఖీదు జారీ

■ సమయపాలన పాటించడం లేదని గ్రామ ప్రజల ఫిర్యాదు

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్:** సమయపాలన పాటించని భోజనం గ్రామ సచివాలయ సిబ్బందికి బండి ఆత్మకూరు మండల ఇంచార్జ్ ఎంపిడిఓ రామక్రిష్ణవేణి శుక్రవారం తాఖీదు జారీ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం గ్రామానికి చెందిన రైతులు తమ భూముల నీటి తీరువ పన్నులు కట్టడానికి సచివాలయానికి వెళ్ళగా అక్కడ సిబ్బంది ఎవరు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం బండి ఆత్మకూరు మండల పరిషత్ అధికారికి ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. అక్కడ ఇంచార్జ్ ఎంపిడిఓ రామక్రిష్ణవేణి ఆత్మకూరులో మీటింగ్ నందు ఉండటంతో స్థానిక తహసీల్దారు పద్మావతి కి వెళ్ళి ఫిర్యాదు చేశారు. గ్రామ సచివాలయంలో నీటి తీరువ పన్ను కట్టుకోవడానికి సిబ్బంది లేరని, తాము పోలాల పనులు పక్కన పెట్టి వచ్చామని సచివాలయాలలో సిబ్బంది లేకుంటే గ్రామ ప్రజల రైతుల సమస్యల పరిష్కారం కోసం మండల కార్యాలయ చుట్టూ తిరగాలని తహసీల్దారు కి విన్నవించుకున్నారు. అనంతరం తహసీల్దారు ఇంచార్జ్ ఎంపిడిఓ కి ఫోన్లో భోజనం సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో లేరని ఫిర్యాదు మేరకు సమాచారం ఇవ్వడంతో భోజనం గ్రామ సచివాలయ సిబ్బందికి పంచాయతీ కార్యదర్శి ద్వారా తాకీదులు జారీ చేశారు. మూడు రోజుల లో వివరణ ఇవ్వాలని సూచించారు. ఆ సమయపాలన పాటించని సచివాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్చార్జ్ ఎంపీడీవో రామక్రిష్ణవేణి తెలిపారు. బండి ఆత్మకూరు మండల వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది ఇష్టానుసారంగా విధులకు హాజరవున్నారనీ సిబ్బంది నిర్లక్ష్యం పై మండల అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



# క్రీడా స్ఫూర్తితో ఎంచుకున్న క్రీడల్లో రాణించాలి

– జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు



లేజర్ రన్ పోటీలను ప్రారంభించిన దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** క్రీడాకారులు తమకు నచ్చిన క్రీడల్లో సాధన చేసి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. శుక్రవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి మోడరన్ పెంటాథలాన్ (లేజర్ రన్) ఎంపిక పోటీలను జిల్లా సంఘం కార్యదర్శి అవినాష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడరన్ పెంటాథలాన్ స్పోర్ట్స్ కోటాలో ఉందని అన్నారు. జిల్లా నుంచి ఇప్పటికే అనేకమంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారని అన్నారు. గత ఏడాది గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో జిల్లాకు చెందిన క్రీడాకారుడు వెంకటేష్ పాల్గొని పతాకం సాధించారని గుర్తు చేశారు. అనంతరం జిల్లా సంఘం కార్యదర్శి అవినాష్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నరసరావుపేటలో ఈ నెల 11నుంచి 13వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మోడరన్ పెంటాథలాన్ సంఘం ఉపాధ్యక్షుడు లోకేష్, డిఎస్ఎ వాటర్ స్పోర్ట్స్ శిక్షకుడు చంద్రశేఖర్, అథ్లెటిక్స్ శిక్షకుడు కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తకు అండగా తెలుగుదేశం పార్టీ

– ఎమ్మెల్యే గిత్త

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. జూపాడుబంగ్లా మండల పరిధిలోని తాటిపాడు గ్రామంలో మొల్ల మన్సూర్ బాషకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు రూ.51,295 చెక్కును ఎమ్మెల్యే గిత్త జయసూర్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఆపన్న హస్తంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతుందని అన్నారు. కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉన్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోపీకృష్ణ, యాదవ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి, డీసీ కమిటీ చైర్మన్ పరమేశ్వరరెడ్డి, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మిదేవమ్మ, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి, గోరే సాహెబ్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు గౌడ్, సురేష్, మన్సూర్‌బాష, లక్ష్మన్న గౌడ్, రమణారెడ్డి, తెలుగు రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు నాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, కురేషి, ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, జంగాల పెద్దన్న, అడ్డాకుల ప్రసాద్, బాబు, షాలుబాష, డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, ఆయా శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, బూత్ ఇన్‌చార్జి, యూనిట్ ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇష్టంతో సాధన చేసి లక్ష్యాన్ని చేరుకోవాలి

– హోంగార్డు కమాండెంట్ మహేశ్వర్



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కఠోర సాధన, ఇష్టంతో లక్ష్యం చేరుకోవాలని జిల్లా హోంగార్డు కమాండెంట్ మహేశ్వర్ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాధనలో ఎన్నో కష్టాలు ఎదుర్కొంటారని వాటన్నింటినీ ఇష్టంతో ముందుకుపోయి లక్ష్యాన్ని చేరుకోవడమే ప్రధానమని ఆయన వ్యాఖ్యానించారు. ఓటమి లేనిదే గెలుపు ఉండదని, అలాంటప్పుడు ఓటమికి కృంగిపోగా గెలుపుకు ఉప్పొంగిపోక ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షులు మునమ్మ, జిల్లా కార్యదర్శి లోకేష్, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నేత కొండేపోగు చిన్న సుంకన్న, జుడో చంద్రశేఖర్, అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి రేష్మ, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్‌తో పాటు అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

# స్టేట్ టాపర్‌గా శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ హర్షిత



హర్షితను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నేషనల్ ఇంటర్ కాలేజి క్రాస్‌వర్డ్ ఎక్స్‌పెడిషన్ నైస్ 2025 శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల స్టేట్‌టాపర్‌గా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపపారు. ట్రిబుల్ ఐ సీఎస్‌ఈ విద్యార్థిని హర్షిత ఏఐసిటీఈ, ఐఐటి మద్రాస్, ఐఐటి ముంబైలతో కలిసి ఎక్స్‌ట్రా–సి నిర్వహించిన ప్రతిష్టాత్మక నేషనల్ ఇంటర్ కాలేజి క్రాస్‌వర్డ్ ఎక్స్‌పెడిషన్ 2025 స్టేట్ టాపర్‌గా నిలిచింది. దేశవ్యాప్తంగా కళాశాల విద్యార్థులలో భాషా మరియు విశ్లేషాత్మక నైపుణ్యాలను పెంపొందించడంలో ఈ జాతీయ స్థాయి పోటీ ప్రసిద్ధి చెందింది. హర్షిత ఇప్పుడు రాష్ట్రస్థాయి పోటీకి అర్హత సాధించింది. ఇది మా సంస్థకుగొప్ప గౌరవాన్ని తెచ్చిపెట్టింది. పాల్గొన్న అనేక మందిలో మొత్తం సౌత్ జోన్‌లోని మా కళాశాల నుంచి ఆరుగురు విద్యార్థులు జోనల్ స్థాయికి ఎంపికకావడం గర్వంగా ఉందన్నా. సీఎస్‌ఈ హెచ్‌ఓడి డాక్టర్ ఫరూక్ అన్ని విద్యార్థులను ఇటువంటి పోటీలలో పాల్గొనమని అభినందించారు. కార్యక్రమ సమన్వయకర్త లావణ్య మాట్లాడుతూ ఎంపిక ప్రక్రియ చాలా పోటీతత్వంతో కూడుకున్నదని తెలిపారు. పోటీ దశల్లో నిరంతర మద్దతు ప్రభావంతమైన సమన్వయానికి యాజమాన్యం ఆమెను అభినందించింది.

# ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య



మృతి చెందిన సుదర్శన్ (27)

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్ :** జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామంలో చోటు చేసుకుంది. బండి ఆత్మకూరు ఎస్సై జగన్మోహన్ తెలిపిన వివరాలు మేరకు ఈర్నపాడు గ్రామానికి చెందిన బెస్త పుల్లమ్మ కుమారుడు బెస్త సుదర్శన్ (27) గత కొద్ది కాలం నుండి పక్షవాతానికి వ్యాధి కి గురై బాధపడేవాడని ఎస్సై తెలిపారు. వ్యాధి తో రెండులు కాళ్లు సచ్చు పడిపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం 11 గంటల లో సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయినాడు అని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు నుండి అందిన ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసక్తికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జగన్మోహన్ వివరించారు.

# సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– వైద్యాధికారి డాక్టర్ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరెడ్డి

**మహానంది, మేజర్‌న్యూస్ :** వర్షాకాలం ప్రారంభమై భారీగా వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాజులపల్లె ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పేర్కొన్నారు. తమ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. మురికి కుంటల వద్ద వేస్ట్ ఆయిల్‌ను చల్లాలని అన్నారు. ఈసమయంలో దోమ కాటు ప్రమాదకరమని, డెంగ్యూ, మలేరియా లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని అన్నారు. తమ ఆరోగ్యం తమ చేతుల్లోనే ఉంటుందని అన్నారు. వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఇంటింటికి తిరుగుతూ గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని అన్నారు.

# పాఠశాల బస్సు కిందపడి చిన్నారి హరిప్రియ మృతి



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఎం.వి నగర్ లో శుక్రవారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కీర్తన స్కూల్ పాఠశాలలో నర్సరీ చదువుతున్న చిన్నారి హరిప్రియ (6) అదేపాఠశాల బస్సు కిందపడి మరణించింది. ఈరోజే పాఠశాలకు వెళ్లిన చిన్నారి .. అదే రోజే బస్సు కిందపడి చివరి రోజుగా మారడం అందరినీ కంటతడి పెట్టించింది. సంఘటన జరగగానే స్కూల్ బస్సు డ్రైవర్ పరారయ్యాడు. స్కూల్ బస్సు దిగుతుండగా డ్రైవర్ బస్సును నడపడంతో అదుపుతప్పిబస్సు టైర్ కింద పడి చిన్నారి ప్రియ మరణించడం జరిగింది. సంఘటన జరగగానే స్కూలు బస్సు డ్రైవర్ పరారయ్యారు. సీఐ యుగంధర్, ఎస్సై నగీనలు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇకపై ఆధునిక టెక్నాలజీతో పోస్టల్ సేవలు




మాట్లాడుతున్న సూపరింటెండెంట్ జనార్థన్ రెడ్డి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** పోస్టల్ డిపార్ట్ మెంట్‌లో ఇకపై ఫ్రెండ్లీ యాప్ పేరుతో పోస్ట్ ఆఫీసులను అధునాతనికరించేందుకు కృషి చేస్తున్నట్లు పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ జనార్థన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని హెడ్ పోస్టాఫీస్ నందు ఆయన విలేకర్ల సమావేశంలో మాటాడారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ డాగ్ సేవా యాప్ పేరుతో ప్రజలకు అనేక సులువైన సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఈ నెల 7న కర్నూలు శాఖ పరిధిలోని 242పోస్ట్ ఆఫీసుల్లో తమ కార్యకలాపాలను నిలిపివేసి కంప్యూటర్ అధునాతనీకరణ చేయడం జరుగుతుందన్నారు. అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీని నెలకొల్పుతూ వాళ్ల యాప్‌లను సరిచేసుకుంటున్నట్లు ఆయన వివరించారు. పోస్టల్ శాఖ వారు తమ పార్సెల్‌లను అతివేగంగా అతి తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# మహానంది క్షేత్రంలో 6న తొలి ఏకాదశి వేడుకలు

– భక్తుల సహకారంతో ఆలయ శుద్ధి



**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్య క్షేత్రంలో ఈనెల 6న తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను నిర్వహిం చడం జరుగుతుందని ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి, వేదపం డితులు రవిశంకర అవధానిలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని అన్నారు. ఆలయ శుద్ధి కార్యక్రమంలో పాల్గొనే భక్తుల సహకారంతో గర్భాలయం, అంతరాలయం, ముఖ మండపం, ధ్వజస్థంబం, రాజగోపురంతో పాటు అన్ని గోపురాలు విశేషమైన మూలికా ద్రవ్యాలతో శుద్ధి కార్యక్రమం జరుగుతుందని అన్నారు. అనంతరం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మూలమూర్తులకు, ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, తిరుమంజన సేవా కార్యక్రమం నిర్వహించబడుతుం దని అన్నారు. స్వామివార్లకు కేవలం పండ్లు, ఫలహారాలతోనే నివేదన సమర్పించడం జరుగుతుందని అన్నారు.

సూర్య
www.suryaa.com
శనివారం | 05 జూలై 2025

# విధ్వంసమైన రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తున్నాం



ప్రజలకు కరపత్రాలు అందించి వివరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చి విధ్వంశం సృష్టించారని, నేడు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తున్నామని నందికోట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. జూపాడుబంగ్లా మండల పరిధిలోని తాటిపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా తాటిపాడు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే జయసూర్యకు ఎంపీడీవో గోపీకృష్ణ, గ్రామ నాయకులు పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, పెట్టుబడులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేవా అని తెలుసుకొని ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కరపత్రాలను ప్రజలకు అందించారు. ప్రతి కుటుంబాన్ని కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని నాయకులకు, అధికారులకు సూచించారు. అభివృద్ధిని ప్రతి ఇంటికి చేరవేయాలని ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమన్వయంతో ముందుకు వెళ్తున్నామని, కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ప్రజాపాలన కొనసాగిస్తున్నామని, అనంతరం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఆరోగ్య కేంద్రాన్ని, రైతు సేవా కేంద్రాన్ని, గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి చిన్నారులకు, కార్యాలయాలకు వచ్చే వారికి మంచి సేవలు అందించాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించి, ప్రజల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి, డీసీ కమిటీ చైర్మన్ పరమేశ్వరరెడ్డి, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మిదేవమ్మ, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి, గోరే సాహెబ్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు గౌడ్, సురేష్, మన్సూర్‌బాష, లక్ష్మన్న గౌడ్, రమణారెడ్డి, తెలుగు రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు నాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, కురేషి, ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, జంగాల పెద్దన్న, అడ్డాకుల ప్రసాద్, బాబు, షాలుబాష, డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, ఆయా శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, బూత్ ఇన్‌చార్జి, యూనిట్ ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలు తనిఖీ

- రూ.20లక్షలు విలువచేసే ఎరువులను సీజ్ చేసిన అధికారులు
- ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు
- వ్యవసాయ అధికారి వరప్రసాద్



ఎరువులను సీజ్‌చేసిన వ్యవసాయ అధికారి

**కోసిగి మేజర్ న్యూస్:** కోసిగి మండలంలో ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి వరప్రసాద్ శుక్రవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా కోసిగిలోని ఎరువుల దుకాణాలను అకస్మాత్తుగా తనిఖీచేయడం జరిగింది. యూరియా అధిక ధరలు అమ్ముతున్నట్లు సూర్య పత్రికలో రావడంతో స్పందించి ఎరువుల దుకాణాలను తనిఖీచేశారు. ఈ తనిఖీలలో శ్రీలక్ష్మీనరసింహ ఏజెన్సీ ఎరువు దుకాణంలో 2లక్షల 50వేల రూపాయలు విలువచేసే ఎరువుల అమ్మకాలను నిలుపుచేయడం జరిగిందన్నారు. అలాగే డమ్మలమ్మదేవి ట్రేడర్స్‌కు చెందిన 8లక్షలు విలువచేసే ఎరువుల అమ్మకాలను నిలుపుచేసి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. ఎవరైనా అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని వ్యవసాయ అధికారి వరప్రసాద్ తెలిపారు. అలాగే కృత్రిమ కొరతను సృష్టిస్తే సహించేది లేదని అలాంటివారిపై కఠినచర్యలు తప్పవన్నారు. అలాగే ఎరువులను అధిక ధరలకు విక్రయించినా.. స్టాక్‌బోర్డు, ప్రైస్‌లిస్ట్ తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని ఎరువుల దుకాణదారులకు ఆదేశించారు. ఎవరైనా రైతులు ఎరులు కావాలంటే రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలని రైతులకు సూచించారు. ఎవరైనా అధికధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

# అధునాతన రహదారుల నిర్మాణ పనులకు శ్రీకారం

**సంజామలమేజర్,న్యూస్ః** బనగానపల్లె నియోజకవర్గంలోని ముదిగేడు - సంజామల మధ్య డానిష్ ఆస్ఫాల్ట్ రీ - ఇన్ఫోర్సింగ్ టెక్నాలజీతో పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మించతలపెట్టిన 2 వరుసల రహదారి నిర్మాణ పనులను రాష్ట్ర రోడ్లు భవనాలు మరియు మౌళిక వసతుల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిర్మాణంలో తారు, అరమిడ్ పాలియోలెఫిన్ అనే ఫైబర్లు కలిపి బిటమిన్ తయారు చేసే టెక్నాలజీ దాని నాణ్యత ప్రమాణాల గురించి డెన్మార్క్ ప్రతినిధులు, ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారులును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో తొలిసారి డానిష్ ఆస్ఫాల్ట్ రీ ఇన్ఫోర్సింగ్ టెక్నాలజి వినియోగిస్తున్న క్రమంలో రోడ్ల నిర్మానం పనులను ప్రత్యక్షంగా పరిశీలించడానికి వచ్చిన మంత్రి బి.సిని సంజామల మండల ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు ఆర్.అండ్.బి శాఖ ఈఎన్సీ రామచంద్ర, ఎన్డీబి సి.ఈ ఎం. వి.ఆర్ వివేకానంద రెడ్డి, మహేశ్వర రెడ్డి, శ్రీధర్ రెడ్డి, డి.ఈ సుధాకర్, డెన్మార్క్ సంస్థ ప్రతినిధులు మైఖేల్, డేవిడ్, జోస్ సెబాస్టియన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి బి.సి

# కదిలిన యంత్రాంగం

## సూర్య ఎఫెక్ట్



పరిశుభ్రంగా ఉండాలని మహిళకు సూచనలిస్తున్న నంద్యాల డిఎంహెచ్ఓ వెంకటరమణ

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో నమోదైన ఐదు డెంగ్యూ కేసులపై అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. నంద్యాల డిఎంహెచ్ఓ వెంకటరమణ, మలేరియా అధికారి సత్యానా రాయణ, మున్సిపల్ కమీషనర్ ప్రసాద్‌గౌడ్‌లు శుక్రవారం డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ వెంకటరమణ డెంగ్యూ బారినపడిన వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేయడం జరిగింది. నీరు నిల్వ ఉండకుండా పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు ప్రజలకు సూచించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య ఆరోగ్య సిబ్బంది, వైద్య అధికారులు సమయపాలన పాటించాలని, లేనియెడల కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నివాస ప్రాంతాలలో పారిశుద్యంపై వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు.

# ప్రతిఒక్కరికీ స్ఫూర్తి అల్లూరి సీతారామరాజు జీవితం



సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేస్తున్న అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** బ్రిటీష్ వారితో పోరాటాలు చేసిన అల్లూరి సీతారామరాజు జీవితం ప్రతిఒక్కరికి స్ఫూర్తి కావాలని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా అన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయలలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటం చేసి ప్రాణాలర్పించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, ఎఆర్ డిఎస్పీ భాస్కర్‌రావు, కమాండ్ కంట్రోల్ సిఐ శివశంకర్, ఆర్ఐలు జావేద్, నారాయణ, సోమశేఖర్ నాయక్, ఆర్ ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఎఆర్ పోలీసులు వున్నారు.

# పీర్ల దేవుళ్లను దర్శించుకున్న ఎమ్మెల్యే గౌరు చరిత



పీర్ల దేవుళ్లను దర్శించుకున్న ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి, నాయకులు

**కల్లూరు, మేజర్‌న్యూస్ః** మండలంలోని పుసులూరు గ్రామంలో మొహరం పండుగ సందర్భంగా పెద్దస్వామి దర్గా, పీర్ల స్వాములను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. పీర్ల స్వాముల దర్శనార్థం పుసులూరు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డికి మండల, గ్రామ తెదేపా నాయకులు ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవజాతిలో త్యాగం ఎంతో గొప్పదని మంచితనం, త్యాగాన్ని గుర్తు చేసుకోవడమే మొహరం వేడుకకు నిజమైన అర్థమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పల్లె ప్రభాకర్ రెడ్డి, ఆర్‌బి కృష్ణ, ఆముదాల అయ్యస్వామి, సుధాకర్ రెడ్డి, కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం

## – నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** దేశ స్వాతంత్ర్య పోరాటంలో మన్యం వీరుడు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పాత్ర ఎంతో కీలకమైందని ఆయన పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసి బ్రిటీష్ వారిపై పోరాడారని వారిని స్మరించుకోవడం జాతి ఎప్పటికీ మరవకూడదన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ వారిపై పోరాడి ప్రాణ త్యాగం చేశారని కొనియాడారు. అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమీషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, ఆర్ఓ జునైద్, సూపరింటెండెంట్ రామక్రిష్ణ, స్వర్ణలత, మంజూర్ బాష, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.





సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

## బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే

# మార్గదర్శిలను గుర్తించాలి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శుల ఎంపిక ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి పీ4పై జిల్లా కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్ధేశం చేశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్ ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించి అందరికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యం అన్నారు. రాబోయే రోజులలో పీ4 గేమ్ చేంబర్ అవుతుందని చెప్పారు. జిల్లాలో జీరో పావర్టి వారిని గుర్తించి పేదరికం నుంచి పైకి తీసుకుని రావాలని, ఇందుకు ఉద్యమ స్పూర్తితో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పీ4 ముఖ్య ఉద్దేశంలో బంగారు కుటుంబానికి హ్యాండ్ హోల్డింగ్, సరైన సమయంలో గైడెన్స్, సరైన సహాయం స్కిల్ డెవలెప్‌మెంట్ చేయడం లక్ష్యం, బంగారు కుటుంబాలను వృద్ధిలోకి తెచ్చే బాధ్యతను మార్గదర్శకులు తీసుకోవాలన్నారు. ఈ పవిత్రమైన లక్ష్యానికి అందరూ అంకితం కావాలని కోరారు. రాష్ట్రంలో స్వర్ణ ఆంధ్ర పీ 4 ఫౌండేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈఫౌండేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ఫౌండేషన్ ద్వారా విద్యా ఆరోగ్యం జీవన ప్రమాణాల మెరుగు తదితరాలపై దృష్టి సారిస్తారని పేర్కొన్నారు. 2029 మొదటి దశలోపు జీరో పావర్టి నిర్మూలించే దిశగా అడుగు వేస్తున్నట్లు చెప్పారు సమాజం కోసం అందరిని భాగస్వాములు చేయాలని ఇది మనందరి బాధ్యత అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనంతరం పి4 పథకాన్ని పటిష్టంగా నిర్వహించేందుకు కలెక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలతో సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. వీసి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జారీ చేసిన సూచనలు మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పీ4 పథకాన్ని పటిష్టంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సీపీఓ వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించేందుకే తొలి అడుగు..



పథకాల గురించి వివరిస్తున్న టిడిపి నాయకులు

**దేవనకొండ మేజర్‌న్యూస్ :** ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందాయా లేదా అనే విషయాలు తెలుసుకొని వారి సమస్యలు పరిష్కరించేందుకే మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టడం జరిగిందని టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి,ఎంపి బస్తిపాటి నాగరాజు,ఆర్టీసి ఛైర్మన్ పూల నాగరాజు,రాష్ట్ర వాల్మీకీ ఛైర్మన్ బొజ్జమ్మ అన్నారు.శుక్రవారం దేవనకొండలోని మూగితాత దర్గా కమ్యూనిటీ హాలు నందు నాయకులు,కార్యకర్తలు,బూత్ కన్వీనర్లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది ముగిసిందని అయితే ఇచ్చిన హామీలలో ఇప్పటికే అమలు చేసిన పలు పథకాల గురించి ప్రజలు ద్వారా తెలుసుకొని వారికి ఇంకా ఏమైనా సందేహాలు,సమస్యలుంటే పరిష్కరించేందుకు యాప్ నందు నమోదు చేసి ప్రభుత్వానికి పంపించాలని సూచించారు.అనంతరం గ్రామంలోని గడప గడపకు తిరుగుతూ అమలు చేసిన పథకాలు గురించి సంతృప్తిగా ఉన్నారా అనే విషయాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్,మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు,మల్లయ్య,బడిగింజల రంగన్న,నీలకంఠం గౌడ్,ఈదుల దేవర బండ సుభాన్,ఆకుల వీరేష్,వెంకట స్వామి గౌడ్,సర్పంచ్ భర్త బండ్లయ్య,మల్లికార్జున గౌడ్,మలకన్న, కప్పట్రాళ్ల మల్లికార్జున,ఉచ్చీరప్ప,నాగరాజు గౌడ్,రాజశేఖర్ గౌడ్,రాజగోపాల్ గౌడ్,మల్లెపల్లి రంగడు, భాస్కర్,రాజా సాహెబ్,టౌన్ ప్రెసిడెంట్ మస్తాన్,చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ నియోజకవర్గం అభివృద్ధి పై ఎమ్మెల్యే సమీక్ష





మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**సమావేశంలో పాల్గొన్న మండల స్థాయి అధికారులు**

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నియోజకవర్గం లోని మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ విజన్ యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రజలను భాగస్వామ్యం చేసి వారి అవసరాలను గుర్తించి ప్రభుత్వం భవిష్యత్తు ప్రణాళికను రూపొందించనుందన్నారు. స్వర్ణాంధ్ర 2047 సాకారానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టాడని భవిష్యత్తు అభివృద్ధి పై ముందు ఆలోచనలో ఉన్న ముఖ్యమంత్రి లాంటి నాయకుడు మనకు దొరకడం అదృష్టం అన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అంశాలపై ప్రణాళికతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. తహసిల్దార్ ఎంపీడీవోలు ఒకటీంగా ఏర్పడి ఆయా మండలాల్లో అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గంలో ఇరిగేషన్, అగ్రికల్చర్, టూరిజం,వైద్యం,విద్య తదితర అంశాలపై అభివృద్ధి విజన్ నివేదికలు సిద్ధంగా ఉంచాలని ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై అభివృద్ధి విషయంలో ముందుకెళ్దాం అన్నారు. అభివృద్ధి విషయంలో అధికారులకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నానని ఎవరు అడ్డం వచ్చినా నా దృష్టికి తీసుకుని రావాలన్నారు. తాను సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. తాను గతంలో టూరిజం మంత్రిగా ఉన్న సమయంలో ఆళ్లగడ్డ శిల్పాలకు జియో ట్యాగ్ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయానికి సంబంధించి వర్షాలు పడని ప్రాంతాలను, వర్షాలు పడే ప్రాంతాలను గుర్తించి అగ్రికల్చర్ ఇరిగేషన్ అధికారులు కలిసి రైతులకు సాగు చేసే పంటలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో 100 పడకల ఆసుపత్రికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అంతకంటే ముందుగా ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. టూరిజం విషయానికొస్తే అహోబిలం పచ్చర్ల నల్లమల అడవి ప్రాంతాలలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయవచ్చని టూరిజం, ఫారెస్ట్ అధికారులు సంయుక్తంగా కలిసి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలో రెండు పార్కులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే చెరువులను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పర్యాటకులను ఆకర్షించే విధంగా తయారు చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదన్నారు. పి ఫోర్ సర్వేలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 6230 నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం గుర్తించిందని వారిని దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని ఆమె అన్నారు. డిఆర్‌డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, అన్ని మండలాల తహసిల్దారులు, ఎంపీడీ వోలు, ఇరిగేషన్, అగ్రికల్చర్, ఫారెస్ట్, విద్య, వైద్యం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిది...

### – టీడీపీ ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి



చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ రాఘవేంద్రరెడ్డి

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో మంత్రాలయం నియోజకవర్గానికి రూ. 2,87,409లు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు టీడీపీ ఇంచార్జ్, మంత్రాలయం సహాకార సంఘం బ్యాంకు ఛైర్మన్ రామకృష్ణారెడ్డిలు పంపిణీ చేశారు. మంత్రాలయంకు చెందిన ప్రదీప్‌కు రూ. 41,250లు, చట్నేపల్లి గ్రామానికి చెందిన నరసింహులు రూ. 41,556లు, చిలకలడోన గ్రామానికి చెందిన లక్ష్మీకి రూ. 20వేలు, గుండు పోగుల ప్రకాష్‌కు రూ. 75వేలు, కౌతాళం మండలంకు చెందిన చాకలి నాగవేణికి రూ. 40,503లు, వినోద్‌కు రూ. 32,900లు, హాల్వి గ్రామానికి చెందిన లలితకు 36,200, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ ఇంచార్జ్ మాట్లాడుతూ, పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందించేవిధంగా సహకరించామన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి వచ్చేలా చూశామన్నారు. సీఎం రిలీఫ్‌ఫండ్ రావడానికి సహకరించిన టీడీపీ ఇంచార్జ్ రాఘవేంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రదీప్‌లకు కృజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, చావిడి వెంకటేష్, మంత్రాలయం టౌన్ ప్రెసిడెంట్ వరదరాజు, టీడీపీ నాయకులు నరసింహాచారి, శివ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

## వాటర్ బాడీస్‌లో ఆక్రమణలు ఉండకూడదు

### – జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డా.బి నవ్య



**కర్నూలు, మేజర్‌న్యూస్ :** హైకోర్టు ఆదేశాల మేరకు వాటర్ బాడీస్ (నీటి వనరులు, చెరువులు)లో ఆక్రమణలు ఉండకూడదని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డా.బి నవ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నీటి వనరులు, చెరువుల ఆక్రమణలకు సంబంధించి జిల్లా స్థాయి వాచ్ డాగ్ కమిటీ సమావేశాన్ని ఇంచార్జ్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని, కోసిగి, సి బెళగల్, కోడుమూరులో ఆక్రమణలను గుర్తించడం జరిగిందన్నారు. వాటర్ బాడీస్ ఆక్రమణలపై హైకోర్టులో పిల్ ఉందని ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక పంపాల్సి ఉంటుందని, అందువల్ల ఇందుకు సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదిక పంపాలని ఇంచార్జ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వాటర్ బాడీస్‌లో గుడిసెలు వంటి తాత్కాలిక ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆక్రమణలకు సంబంధించి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయతీలలో నీటి వనరులున్న ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని ఇంచార్జ్ కలెక్టర్ డిపిఓ, మున్సిపల్ కమీషనర్‌లను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, కర్నూలు మున్సిపల్ కమీషనర్ రవీంద్రబాబు, ఆర్డీఓ సందీప్ కుమార్, సర్వే ఏడి మునికన్నన్, కర్నూలు అర్బన్, రూరల్ తహశీల్దార్లు రవి, రమేష్, సి బెళగల్ తహశీల్దార్ వెంకటలక్ష్మి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ పాల్గొన్నారు.

## సీవోపై చర్యలు తీసుకుంటాం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** సీవో లక్ష్మికుమారిపై చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ మేరకు సీఆర్‌పీలు నిరసన కార్యక్రమాన్ని విమరణ చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, గౌస్‌లు మాట్లాడుతూ సీఆర్పీపైన దాడి చేసిన సీవో లక్ష్మికుమారిపై చర్యలు తీసుకోవాలని గత మూడు రోజులుగా నిరసన కార్యక్రమాలు సీఐటీయు ఆధ్వర్యంలో చేయడం జరిగిందని అన్నారు. సీఆర్పీ భవానిపై దాడి చేసి, ఆర్పీని రూ. 30 వేలు ఇవ్వాలని, లేకుంటే విధుల నుంచి తొలగిస్తానని బెదిరించిన సీవో లక్ష్మిపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటలింగం, యూనియన్ అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి హైమావతి, సీఆర్పీలు ప్రసన్నకుమారి, సులోచన, సత్యవతి, జ్యోతి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి సంక్షేమం...

## అదే కూటమి ప్రభుత్వ ధ్యేయం – ఎమ్మెల్యే బుడ్డా

### – సిద్దపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా



కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించి అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని సిద్దపల్లె గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రనజలు పుష్పగుచ్చాలు, పూలమాలలతో, మహిళలు హారతులతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. గ్రామ నాయకులు గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మధ్య కేక్ కట్‌చేసి సుపరిపాలనలో తొలి అడుగు సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. పేద విద్యార్థులు సైతం కార్పోరేట్ విద్యనందించాలనే ధ్యేయంతో తల్లికి వందన ద్వారా ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి నగదు జమచేయడం జరిగిందన్నారు. మహిళలకు ఉచిత సిలిండర్లు అందించామని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సంక్షేమం, అభివృద్ధితో ప్రజల మనుసు గెలుచుకున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అందుకు ఇంటింటికి తిరిగి వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com
శనివారం | 05 జూలై 2025

# అన్ని వర్గాలకు భరోసాగా పాలన



ఇంటింటికి కార్యక్రమంలో టీడీపీ నాయకులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** కూటమి ఏడాదిపాలనలో అన్ని వర్గాలకు భరోసాగా నిలుస్తుందని, సంక్షేమ అభివృద్ధికి సమ ప్రాధాన్యతఇస్తూ పాలన కొనసాగుతుందని పట్టణ అధ్యక్షుడు మాచాని మహేష్, 23వ వార్డు ఇంచార్జి సోమల గూడూరు బాషా, టీడీపీ చేనేత నాయకులు బుగిడె నాగరాజులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు సుపరి పాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారంఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, మంత్రులు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. గత వైసిపి పాలనలో ఐదేళ్లపాటు విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతూనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేని వైసీపీ నేతలు అబద్ధాలు చెప్పేందుకు వస్తున్నారని, వారిని నమ్మవద్దని కోరారు.ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పట్టణం అభివృద్ధి పథంలో ముందు పోతుందని తెలిపారు. కార్యక్రమంలో సురేష్,తరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

# గని చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే

**గడివేముల మేజర్ న్యూస్:** గడివేముల మండలంలోని గని గ్రామ సమీపంలో ఉన్న చెరువును శుక్రవారం నాడుఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి పరిశీలించారు. గని గ్రామ చెరువుకు తుమ్ సౌకర్యం ఏర్పాటు చేస్తే దాదాపు800 నుంచి 1000ఎకరాల దాకా పంటలకు సాగునీరు అందించవచ్చు అని ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డికు మాజీ మండలాధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చెరువుకు చెందిన పొలాన్ని సోలార్ ఆథని కంపెనీ వాళ్ళు తూము నిర్మించే స్థలాన్ని సోలార్ వారి ఆధీనంలో ఉన్నది.రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడి గని చెరువుకు తూము నిర్మాణం చేపట్టి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని వ్యయ రైతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, హర్షవర్ధన్, రైతులు పాల్గొన్నారు.



తూము ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

# గోనెగండ్లలో ఘనంగా సరిగెత్తు వేడుకలు



గోనెగండ్లలో పూజలు అందుకుంటున్న పీర్లు

**గోనెగండ్ల,మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన గోనెగండ్లలో మోహర్రం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జామున చిన్న సరిగెతు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేళతాళలతో పీర్ల దగ్గరకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్లు సవారి నిర్వహించారు. పీర్లదేవుళ్లకుపూలదండలతో అలంకరించారు. భక్తులు చావిడిల దగ్గర చిందులు తొక్కారు. పలు విచిత్ర వేశధారణలతో భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. విచిత్ర వేశాలను గ్రామస్థులను అలరించారు. 6వతేదిన మోహర్రం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ముజావర్లు దరగల మాబు, ముల్లా రహీంబాషా తెలిపారు.

## టంగుటూరు శీనయ్యను పరామర్శించిన మంత్రి బి.సి దంపతులు

**బనగానపల్లెమేజర్,న్యూస్:** గత కొంత కాలంగా తీవ్ర వెన్నునొప్పితో బాధపడుతూ విశ్రాంతి తీసుకుంటున్న తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగాల శాఖా జిల్లా అధ్యక్షులు మరియు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్యను నేడు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ఆయన సతీమణి బి.సి ఇందిరమ్మలు బనగానపల్లె పట్టణంలోని కరెంటు ఆఫీసు ప్రాంతంలో ఆయన నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. శీనయ్య సాధ్యమైనంత త్వరలో అనారోగ్యం నుండి కోలుకోని సాధారణ జీవితం ప్రారంభించాలని మంత్రి బి.సి ఆకాంక్షించారు.



శీనయ్యను పరామర్శిస్తున్న దృశ్యం

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**కోసిగి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన చెన్నబసవ అనే యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందారు. శుక్రవారం కోసిగి ఆదోని రహదారిలో ఈ రోడ్డు ప్రమాదానికి గురికావడం జరిగింది. జంపాపురం గ్రామం నుండి స్కూటర్‌పై కోసిగి మీదుగా కౌతాళం మండలం బాపురం గ్రామానికి వెళుతుండగా ఎదురుగా ట్రాక్టర్‌ను తప్పించబోయి ఈ ప్రమాదానికి గురికావడం జరిగింది. అయితే చెన్నబసవకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన 108అంబులెన్స్‌లో చికిత్సకోసం ఆదోనికి తరలించినా.. పరిస్థితి తారుమారు కావడంతో చనిపోయినట్లు 108సిబ్బంది తెలపడంతో భార్య గంగోత్రి బోరున విలపించారు. అయితే పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

# అభివృద్ధి చూసి ఓర్వలేక చౌకబారు విమర్శలు



**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక వైకాపా నేతలు విమర్శలు చేస్తున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలియజేశారు మండలంలోని చిన్న భోదనం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు భాగంగా శుక్రవారం సాయంత్రం ఆమె పర్యటించారు ఈ సందర్భంగా గ్రామంలో 33 లక్షలతో పూర్తయిన సిమెంట్ రహదారులను ప్రారంభించారు అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో వైకాపా నాయకులు గతంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని నేడు కూటమిప్రతం అధికారంలోకి వచ్చాక పలు అభివృద్ధి పనులు చేశామన్నారు గ్రామానికి రూ 63 లక్షలతో 28వ బ్లాక్ తెలుగు గంగ కాలువ పనులను చేపట్టడంతో సమీప 5 గ్రామాల రైతులకు నీరు అందుతుండడంతో ఎంతో హర్షం వ్యక్తం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ఏడాదిక కాలంలోనే సూపర్ సిక్స్ లో భాగంగా తల్లికి వందనం గ్యాసు తదితర పథకాలను అమలు చేసిందన్నారు. రానున్న రోజుల్లో అభివృద్ధి పనులను మరింత చేయనున్నట్లు ఆమె వివరించారు. చేసిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక వైకాపా నేతలు చౌకబారు విమర్శలకు దిగుతున్నారన్నారు కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్ భాష డిస్ట్రిబ్యూటీ ఛానల్ కమిటీ చైర్మన్ యామా శెజ్జారెడ్డి తెదేపా నాయకులు రమణారెడ్డి కాటసాని రామిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి లక్ష్మి రెడ్డి నాగరాజు మౌలాలి జనార్దన్ రెడ్డి కుమార్ రెడ్డి వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రజలకు సేవలు చేద్దాం

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** పోరాట యోధులు, స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రజలకు సేవలు చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా యువజన సంక్షేమ శాఖ-సెట్కూరు, గిరిజన సంక్షేమ శాఖ ఆద్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా.బి నవ్య మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో మనం దేశభక్తిని మరింత పెంచుకోవడం, దేశ ప్రజలకు సేవ చేయడం మన కర్తవ్యమన్నారు. ప్రభుత్వ సేవలో మనం ఉన్నామని కావున ఆ మహానుభావుడి స్ఫూర్తితో మనం ప్రజలకు మరింతగా సేవలు చేయాలని కోరారు. గిరిజన సంఘం నాయకులు గిరిజనుల పట్ల జరుగుతున్న అసమానతలను తెలిపారు. వాటిని దృష్టిలో ఉంచుకుని సరిచేసే చర్యలు చేపడతామన్నారు. ఎస్సి, ఎస్టి అట్రాసిటీలకు చెందిన సమస్యలను వెరిఫై చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ట్రైబల్ గ్రామాలకు తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర మౌలిక వసతుల సమస్యలను జిల్లా కలెక్టర్ ఆద్వర్యంలో ఎన్‌ఆర్‌ఈజిఎస్ ద్వారా చేస్తున్నామని ఇంకా మిగిలిపోయినవి ఏవైన ఉంటే వాటిని కూడా జిల్లా అడ్మినిస్ట్రేషన్ అత్యంత ప్రాముఖ్యతను ఇచ్చి పూర్తి చేస్తామని తెలిపారు. సెట్కూరు సిఈఓ వేణుగోపాల్ మాట్లాడుతూ తెలుగు వీర లేవరా దీక్ష బోని సాగరా అంటూ తెలుగు జాతిని చైతన్య పరిచిన అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులర్పించుకుంటున్నానని, ఆయన స్ఫూర్తితో ప్రజలకు సేవలు చేస్తామన్నారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ గిరిజనులకు రావాల్సిన ఇంటి స్థలాలు, ఇళ్లు, కాంపెన్సేషన్‌లు మొదలగు బెనిఫిట్స్ అన్ని వెంటనే ఇప్పించే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మూడవ శనివారం ఎస్‌సి/ఎస్‌టి గ్రీవెన్స్ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, ఇంచార్జ్ ట్రైబల్ ఆఫీసర్(యస్‌డిసి) కొండయ్య, కలెక్టరేట్ ఏఓ శివ రాముడు, టూరిజం అధికారి విజయ, సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు, తహశీల్దార్ రమేష్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు గోవింద్ సింగ్, వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, ఇంద్రాణి, ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు ఎరుకల రాజు, కుశలన్న, హరి, లంబాడ సంఘం నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ అధికారి సేవలు మరువలేనివి – బి.సి రాజారెడ్డి


**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె పట్టణ గ్రంథాలయ శాఖా అధికారి బషీర్ అహ్మద్ సేవలు మరువలేనివని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి అన్నారు. శుక్రవారంనాడు బనగానపల్లె పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో బషీర్ అహ్మద్ పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బషీర్ అహ్మద్ గ్రంథాలయ అధికారిగా బాధ్యతాయుతంగా పని చేశారని తెలిపారు. పుస్తకాలు చదవడం వల్ల మెదడులో విషయాలు గుర్తుంటాయని నేటి యువత టెక్నాలజి పేరుతో దినపత్రికలు పుస్తకాలు తెరవడం మర్చిపోతున్నారన్నారు. బసీర్ అహ్మద్ గ్రంథాలయానికి వచ్చే పాఠకులను, విద్యార్థులను ఆప్యాయంగా పలకరించి వారి మనసులను తెలుసుకున్నారన్నారు. అత్యాధ్మిక కార్యక్రమాలు మరింత ముందుకు తీసుకుపోవాలన్నారు. విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు గ్రంథాలయంలోనిర్వహించడం సంతోషకర విషయమన్నారు. గ్రంథాలయ భవన నిర్మాణంలో కీలకపాత్ర బి.సి రాజారెడ్డిదేనని జిల్లా గ్రంథాలయ అధికారి ప్రకాష్ గతంలో బనగానపల్లె మండలంలో సరైన వసతులు లేక ఇబ్బంది పడేవారని రాజారెడ్డి సహకారంతో నూతన భవనాన్ని నిర్మించడం జరిగిందని జిల్లా గ్రంథాలయ అధికారి ప్రకాష్ గుర్తు చేశారు. ఈ సందర్భంగా బి.సి రాజారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో బషీర్ అహ్మద్ కుటుంబ సభ్యులు గ్రంథాలయ అధికారి రాఘవ రెడ్డి, శ్రీరాముడు, రామదాసు, శరత్‌బాబు, అరుణ గీత, తదితరులు పాల్గొన్నారు.



బి.సి రాజారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

# చిన్న సరిగెత్తుకు పోటెత్తిన భక్తులు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో మొహరం వేడుకలలో భాగంగా శుక్రవారం మండలంలో వైభవంగా చిన్న సరిగెత్తు నిర్వహించారు. గురువారం రాత్రినుండి శుక్రవారం ఉదయం వరకు మొహరం వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహించారు.చిన్న సరిగెత్తులో భాగంగా మండలంలో ఆయా గ్రామాలు గొల్లలదొడ్డి చందమామయ్య పీర్లు,బెళగల్ చిన్న ఇమాంఖాశిం పీర్లు,కంబదహాల్ దస్తగిరయ్య పీర్ల కు గురువారం రాత్రి నుండి శుక్రవారం తెల్లవారు జామువరకు భక్తులు మొక్కులు చెలించి సదివింపులు చదివించారు.అనంతరం పీర్ల దేవులను ఆయా దర్గాలకు తీసుకెళ్లి చదివింపులు చదివించారు.వైభంగా జరిగిన చిన్న సరిగెత్తు కు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు భక్తులే కాదు ఇతర రాష్ట్రాల నుండి భక్తులు వేలాదిగా తరలివచ్చి చదివింపులు చదివించి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులకు అన్నదాన సదుపాయం కల్పించమని మొహరం నిర్వాహక పెద్దలు తెలిపారు.



## శ్రీ చౌడేశ్వరీ అమ్మవారికి పల్లకీ సేవ

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్:** శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి పల్లకి సేవను నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారంనాడు వైభవంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారంనాడు అమ్మవారి పల్లకి సేవను నిర్వహించడం ఆనవాయితి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో అలంకరించి వేద మంత్రోచ్ఛరనడుమ పల్లకిలో కూర్చొబెట్టి ప్రధాన ఆలయం చుట్టూ పల్లకి సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తనపై చేసిన వ్యాఖ్యలను నిరూపించాలి

**ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధమే**

**అహోబిలంలో జరిగే ఘనకార్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి ..నీకు కనపడడం లేదా?**

**నోటికి వచ్చిన అబద్ధాలు చెప్తే ఊరుకునే వారు లేరు..మాజీ ఎమ్మెల్యే గంగుల నాని**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల నాని

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** అహోబిలంలో రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియతనపై ఆరోపణలు చేసిందని వాటిని నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమని మాజీ ఎమ్మెల్యే గంగుల నాని అన్నారు. శుక్రవారం ఆయన అహోబిలంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత 2 రోజుల కిందట అహోబిలంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియనోటికొచ్చిన అబద్ధాలు మాట్లాడిందనితనపై ఆరోపణలు చేసిందని వాటిని ఆమె నిరూపించాలని ఆయన సవాల్ చేశారు.అహోబిల నరసింహ స్వామి మీద ఒట్టేసి ఒకటే చెప్తున్న ఆమె చేసిన వ్యాఖ్యలను నిజమని నిరూపించాలనిఆరోపణలు నిజమని నిరూపిస్తే నేను దేనికైనా సిద్ధమే అన్నారు. అహోబిలం టోల్గేట్20 లక్షల టెండర్ సవాల్‌కు 25 లక్షలు రాయబారం పంపించారన్నావు ఎవరైనా నమ్మే మాటలేనా,మాట్లాడేముందు కొంచెం అయిన ఇంగిత జ్ఞానం ఉండాలి అన్నారు.మా ప్రభుత్వంలో ఇదే టెండర్ 40 లక్షలకు పలికిందని, గత సంవత్సరం 19.60 లక్షలకు పలికిందని, ఇప్పుడు 20.30 లక్షలకు టెండర్ పలకడం జరిగిందన్నారు.నువ్వు నిజాయితీగా ఉంటే టెండర్ పెరుగుతుందని, మరి ఇంత తక్కువకి ఎందుకు పలికిందో, ప్రభుత్వ ఆదాయానికి ఎందుకు నష్టం వచ్చిందో చెప్పాలన్నారు. ఇప్పుడు పాడిన ఇదే టెండర్లను 45 లక్షలకు పాడి మీ ప్రభుత్వానికి నేను ఆదాయం తీసుకొస్తానని అందుకు నీవు సిద్ధమేనా అని గంగుల నాని అన్నారు.ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పనులు చేయకుండా ప్రజల మీద పడి అడ్డగోలుగా సంపాదిస్తూ నువ్వు మా గురించి మాట్లాడుతావా అని విమర్శించారు. అహోబిలంలో జరిగే ఘన కార్యాలాన్ని భక్తులు సోషల్ మీడియాలో పెడుతుంటే నీకు కనపడ్డం లేదా అని ప్రశ్నించారు. 45 లక్షల టెండర్ పాడినప్పుడే టోల్గేట్ 150 రూపాయలు వసూలు చేశారని, ఇప్పుడు 20 లక్షలు టెండర్ పోతే టోల్గేట్ 75 రూపాయలు వసూచేయాలని మరి ఎంత వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. గేటు ధరల బోర్డు ఎందుకు ఎందుకు పెట్టలేదు అన్నారు. నోటికొచ్చిన ఆపద్దాలు మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకొనే వారు ఎవరు లేరన్నారు.గడిచిన 13 నెలల్లోనే మీరు చేసే ధర్మ పాలన చూసి ప్రజలకు కళ్ళు బైర్లు కమ్మాయన్నారు.ఇంకొన్నాళ్ళు ఓపిక పట్టుకోండి మీరు చేసిన వాటికి ఆధారాలు, చెప్పిన వాటికి సమాధానాలు అన్ని వస్తాయి అన్నారు.నన్ను తమ్ముడు అన్నావు దానికి నేను ఏం బాధ పడలేదు ఎందుకంటే నువ్వొక మహిళగా నన్ను ఏమనుకున్నా నేనేం బాధపడనన్నారు. 60 -40 కమిషన్ అని మాట్లాడావని, ఒక్కసారి ఆ రాయబారిని చూపెట్టాలన్నారు. ఎవరు మంచి చేస్తున్నారో ,చెడు చేస్తున్నారో ప్రజలకు తెలుసునన్నారు. ఆయనతోపాటు విజయ డైరీ డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షులు నాసారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగ

**గడివేముల మేజర్ న్యూస్ :** గడివేముల మండలంలోని పెసర వాయి గ్రామంలో శుక్రవారం నాడు మొహర్రం పండుగ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పెద్ద స్వామి ఫీరును దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ హిందూ, ముస్లింలు కలిసి భక్తిశ్రద్ధలతో జరుపుకునే మొహర్రం వేడుకలు ప్రజల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో సరైన సమయానికి వర్షాలు కురిసి పాడి,పంటలతో గ్రామాలు పచ్చగా ఉండి అన్నదాతలు సుఖంగా ఉండాలని పెద్ద స్వామికి ప్రత్యేక పూజలునిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనకు తొలి అడుగు అని కార్యక్రమంలో తెలుగు మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ వడ్డు లక్ష్మీదే వి, వద్దు ప్రశాంతి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే చరిత రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను వివరించారు. మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, మండలకన్వీనర్ దేశంసత్యనారా యణరెడ్డి, అంగజాలకృష్ణయాదవ్, శ్రీనివాస్ యాదవ్, టిడిపి యువ నాయకుడు దిలీప్ కుమార్ రెడ్డి,కరిమద్దల ఈశ్వర్ రెడ్డి, బాలీశ్వర రెడ్డి, నారాయణరెడ్డి, సుదర్శన్ రెడ్డి, జయప్రకాశ్ రెడ్డి,కందిశ్రీనివాసులు,చిందుకూర్ సర్పంచ్ అనసూయమ్మ, సుభద్రమ్మ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెద్ద స్వామి పీరుకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

# గంగమ్మ చెరువు ఆక్రమణలను తొలగించండి

(మొదటి పేజి తరువాయి)

గంగమ్మ చెరువును 2021లో 14 ఎకరాల స్థలం ప్రైవేట్ వ్యక్తులకు చెందిందంటూకొందరుఆక్రమించారు. 14ఎకరాల్లోచెరువును పూడ్చి వేసి తమ అధీనంలోకి తీసుకున్నారు. దీనిపై తెలుగుదేశం పార్టీ నేత ఎదురూరురాజవర్ధన్‌రెడ్డి నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించారు. ఇప్పుడు దీనిపై ఎన్‌జిటి తీర్పు వచ్చింది. రాజవర్ధన్‌రెడ్డి పక్షాన ఆయన తండ్రి, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్‌జిటికి హాజరయ్యారు. ఎన్‌జిటి తీర్పుతో చెరువు ఆక్రమణలను తొలగిస్తే నాలుగు గ్రామాల ప్రజలకు తాగు, సాగు నీటి కష్టాలు తీరినట్లవుతుంది. ఎన్జీటీ తీర్పు రియల్ ఎస్టేట్ గద్దలకు పెద్ద షాక్‌లాంటిదే.

గంగమ్మ చెరువుపై తాండ్రపాడుతో పాటు పుసుపుల, నూతనపల్లి, సూదిరెడ్డిపల్లె, రుద్రవరం గ్రామాలు తాగు, సాగునీటికి ఆధారపడ్డాయి. 70ఎకరాల విస్తీర్ణంలో ఈచెరువు సహజంగా ఏర్పడింది. రెవెన్యూ అధికారులు ఈచెరువు ఆక్రమణకు సహకరించారన్న ఆరోపణలున్నాయి. అప్పటి వైకాపా ప్రభుత్వ హయాంలోని కొందరు పెద్దలు కూడా ఈ అక్రమణకు సహకరించారన్న వార్తలూ బయటకు వచ్చాయి. చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలంటూ పలు సంఘాలు ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు వినతి పత్రాలు సమర్పించాయి. ఆందోళనలు కూడా చేశాయి. వీటికి స్పందించిన అప్పటి జిల్లా కలెక్టర్ వీరపాండియన్ నిజానిజాలను తేల్చేందుకు అధికారులతో ఒక కమిటిని వేశారు. అయితే, కమిటి ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయింది. 2005లో గంగమ్మ చెరువును అధికారికంగా చెరువుగా గుర్తించి పంచాయితీరాజ్ నుండి మైనర్ ఇరిగేషన్‌కు బదిలీ చేస్తూ జీఓ 216 ప్రకారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్న చెరువు స్థలంలో ఎలాంటి కార్యకలాపాలకైనా ఆ శాఖను ఎన్ఓసి తీసుకోవలసి ఉండగా, ఆక్రమణదారులు అలాంటివి లేకుండానే 14 ఎకరాల స్థలాన్ని తమదిగా చెప్పుకుంటూ చెరువులో ఆ భాగాన్ని పూడ్చేశారు. కర్నూలు రూరల్ తహశీల్దార్ జూన్ 17, 2021లో ఇచ్చిన ప్రోసీడింగ్స్ మేరకు 76,77,78,79,80,81, 299, 309, 310 సర్వేనెంబర్లలో చెరువు ఉంది. ఈ చెరువులోని 81/1, 299 సర్వే నెంబర్లలోని స్థలాన్ని పూడ్చిన ధూళిపాళ్ల కిరణ్, ధూళిపాళ్ల వెంకటరావు, ధూళిపాళ్ల కోటిస్వామి, ఆర్తిబాబయ్య, సావూరు రాజశేఖరప్పలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అప్పటి కర్నూలు తహశీల్దార్ తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. చెరువు ఆక్రమణకు రెవెన్యూ అధికారులు సహకరించారన్న ఆరోపణలూ ఉన్నాయి. చెరువును పట్టాభూమిగా చూపించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించారు. ధూళిపాళ్ల కిరణ్ తదితరులు చెరువులోని కొంత భాగం తనదని చెబుతుండగా, 1985లో మరి కొంత భూమిని జి.పుల్లారెడ్డి కొనుగోలు చేసినట్లు రికార్డుల ఉన్నాయంటున్నారు. వివాదం ముదరడంతో జి.పుల్లారెడ్డి కుటుంబం ఈ చెరువులోని తమ భాగాన్ని గ్రామానికి ఇచ్చేసినట్లు తెలుస్తోంది. పంచాయితీరాజ్ నుండి మైనర్ ఇరిగేషన్‌కు బదిలీ అయ్ని చెరువు భూములు 1908కి ముందు ఎవరి పేరుతో ఉన్నాయన్న రికార్డులు రెవెన్యూ అధికారుల వద్ద లేవు. 1908 నుండి 1985 వరకు ఈ భూములపై ఎలాంటి లావాదేవీలు జరగలేదు. 1985, 1990 తర్వాత 2009 నుండి ఏడాదికి, రెండేళ్లకు క్రయవిక్రయాలు జరిగినట్లు రికార్డుల్లో ఉంది. 1985 నుండి 2020 వరకూ క్రయవిక్రయాలు జరిగినట్లు అధికారులు చెప్పినా 2021 వరకు దాన్ని చెరువుగానే ఎందుకుంచారన్న ప్రశ్నకు సమాధానాలు దొరకలేదు. 2021లోనే చెరువును ఆక్రమించే ప్రయత్నాలు జరిగాయి. ఆక్ర మణకు పూనుకున్న వారు ఆ స్థలంలో చెట్లు పెంచారు. శుక్రవారం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆ పూడ్చివేతను తొలగించాలంటూ తీర్పునివ్వడంతో చెరువుకు మళ్లీ పూర్వపు రోజులు వస్తాయని ఆశిస్తున్నారు.

# పేద క్రీడాకారుడికి చేయూత

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** జాతీయ స్థాయిలో ఆడిన ఫుడ్ బాల్ క్రీడాకారుడు ఈశ్వర్ పేదరికం అడ్డుగా మారడంతో వ్యాపార వేత్త పరమేష్ ఆ క్రీడాకారుడుకు తనవంతు సహాయం అందించి అండగా నిలిచాడు. ఫుడ్‌బాల్‌కిట్,ట్రావెల్ బాక్స్, బట్టలు అందించారు. అనంతరం పరమేష్ మాట్లాడుతూ తన కుమారుడు రవితేజ రోడ్డు ప్రమాదంలో మరణించడని, అప్పటి నుండి ప్రతి ఏడాది కుమారుడు పుట్టినరోజు, వర్ధంతి రోజు ఎదో ఒక సేవ కార్యక్రమం నిర్వహిస్తామని అందులో భాగంగా నేడు మూడో వర్ధంతి సందర్భంగా జాతీయ క్రీడాకారుడు ఈశ్వర్ కు పేద విద్యార్థి అని తెలుసుకొని తన వంతుగా చేయూత ఇవ్వడం జరిగిదన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ రామకృష్ణ నాయుడు, సరతాజ్ నావాజ్, వంశీ కృష్ణా, సుభాన్, రాము, వంశీ, మల్లి క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారుడికి కిట్ ను అందజేస్తున్న దృశ్యం

# ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా



**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ఏపీ పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై గలమెత్తి వీటిని యాజమాన్యం అటు ప్రభుత్వము తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నినాదాలు చేశారు.ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సలాం, డిపో సెక్రెటరి డి.దానం నాగయ్య,ఏటి రెడ్డి,ఏబిసీ సుభాన్సుభాన్, చెన్నయ్య, రహీమ్ బాబు, పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీ

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా మండిగిరి టీడీపీ ఇంచార్జ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ ఆచారిశుక్రవారం విద్యార్థులకు ఉచితంగా స్లేట్స్, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఆదోని మండిగిరి పరిధిలోని ఎలిమెంటరీ స్కూల్లోఉన్న దాదాపు 80మంది విద్యార్థులకు ఆయన తన సొంత నిధులతో సమకూర్చినోటు పుస్తకాలను ఇతర సామాగ్రిని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ఆచారి మాట్లాడుతూ దాతలు, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకొని విద్యార్థులందరూ ఉన్నతంగా చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ సుజాత, టీడీపీ నాయకులు డిష్ ఈరన్న, వెంకటేష్, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.


నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ ఆచారి

# పామ్ ఆయిల్ పంటపై రైతులకు అవగాహన సదస్సు



**పాములపాడు, మేజర్ న్యూస్ :** ఉద్యాన శాఖ మరియు పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పాములపాడు మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణలో రైతులకు పామాయిల్ పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల ఉద్యాన అధికారిని చందన, మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి, పతా ంజలి డిప్యూటీ మేనేజర్ రమణారెడ్డి లు పాల్గొన్నారు వారు మాట్లాడుతూ పామ్ ఆయిల్ పంట సాగు చేసుకుంటే రైతులకు అందించే సబ్సిడీ వివరాలను తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ బి కే సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు.. ఎంపీ బైరెడ్డి శబరి

**పాములపాడు మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆమె శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని ఇస్కాల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన మంచి పనులను వివరించారు. అంతేకాకుండా ప్రజలతో కలసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు తదితర పథకాలపై ఆరా తీశారు. గత ప్రభుత్వం లో ఒక పిల్లవాడికి డబ్బులు వేసి ఏదో గొప్ప లో చెప్పేవారని ఇప్పుడు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్న అందరికీ తల్లికి వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆమె వివరించారు త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా కలుగుతుందని మహిళలకు వివరించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కాకరవాడ వెంకటస్వామి, బిఎస్ఎన్ఎల్ కమిటీ మెంబర్ కురువ రమేష్, మల్లికార్జున, ఈశ్వర్ రెడ్డి, గ్రామస్తులు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



సూర్య www.suryaa.com



# సమస్యల సత్వర పరిష్కార మార్గమే ప్రజాదర్బార్ : మంత్రి ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఫరూక



మహిళ తన సమస్యను మంత్రికి వివరిస్తున్న దృశ్యం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ప్రజలు తమ సమస్యలతో ఇబ్బందులు పడుతూ సతమతమవుతుంటారని, వారి సమస్యలకు సత్వర పరిష్కార మార్గమే ప్రజాదర్బార్ అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం నంద్యాల అబాండం తాండ(సుగాలి మెట)లో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ అని అన్నారు. ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక, పలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కాలయాపన, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ప్రజలకు ప్రజాదర్బార్ మంచి అవకాశమని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం పలు రకాల సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి, అబాండం తాండ టీడీపీ అధ్యక్షుడు, నంద్యాల మార్కెట్ యార్డు డైరెక్టర్, టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుమావత్ స్వామినాయక్, తహసీల్దార్, ఎంపీడీవో, వివిధ శా ఖల ప్రభుత్వ అధికారులు, నంద్యాల మార్కెట్ యా ర్డు చైర్మన్ హరిబాబు, కొట్టాల శివనాగిరెడ్డి, నం ద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథ్‌రెడ్డి, కేసీకెనాల్ చైర్మన్ బాబోలు ఇలియాజ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ నారాయణ, రాజేష్, గోవింద నాయుడు, మండ్ల గుర్రప్ప, కట్టెల డిపో గఫార్, రమేష్‌నాయక్, విజయ్‌నాయక్, కార్తీక్ నాయక్, గ్రామ పెద్దలు, మహిళలు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు మేలుచేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయం : ఎంపి బైరెడ్డి శబరి

- సమస్యల కారణంగానే కార్యక్రమంలో పాల్గొనలేదు..
- ఏరాసు ఇంటికి బ్రేక్‌ఫాస్టుకు ఆహ్వానిస్తే వెళ్లా..




పాత్రికేయులతో మాట్లాడుతున్న ఎంపి బైరెడ్డి శబరి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం పథకం ద్వారా దివ్యాంగులకు అవసరమైన పరికరాలు పంపిణీ చేసి వారికి మేలు చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎంపి బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం ఆత్మకూరులో జరిగే దివ్యాంగుల పరికరాల పంపిణీకి రాగా సమస్యల కారణంగా కార్యక్రమంలో ఎంపి పాల్గొనలేదు. ఈ సందర్భంగా ఎంపి పాత్రికేయులతో మాట్లాడుతూ నారా లోకేష్ పర్యటనలో దివ్యాంగుల వచ్చి తమకు అవసరమైన పరికరాలు అందించి దివ్యాంగుల సంక్షేమాభివృద్ధికి కృషి చేయాలని కోరడం జరిగిందని, స్పందించిన ఆయన కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఎడిఐపి పథకం ద్వారా దివ్యాంగులకు పరికరాల పంపిణీకి శ్రీకారం చుట్టారని అన్నారు. అయితే రాష్ట్రంలోని ఏడు నియోజకవర్గాలలో జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా తాను ఆత్మకూరులో జరిగే కార్యక్రమానికి హాజరు అయ్యేందుకు వచ్చానని,మూడు రోజుల ముందే ఎమ్మెల్యే కలిసి ఈ కార్యక్రమం గురించి వివరించడం జరిగిందన్నారు. ఇద్దరం కలిసి ఈ కార్యక్రమాన్ని చేయాలనుకున్నా ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడం, చిన్న సమస్యల కారణంగా తాను కూడా కార్యక్రమంలో పాల్గొనలేకపోయానని చెప్పారు. అయితే అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలివచ్చిన దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్యక్రమం సజావుగా జరిగిందని అమె చెప్పుకొచ్చారు. ఏరాసు ఇంటికి ఎందుకు వెళ్ళాల్సి వచ్చిందని మీడియా ప్రశ్నించడంతో మాజి మంత్రిగా తనకు సుపరిచతుడని, ఆయన బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానిస్తే వెళ్ళామే తప్పా మరేమి లేదని అన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

**– మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి**



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** కూటమి ప్రభుత్వంతోనే సుపరి పాలన అని రాష్ట్ర రోడ్లు భవనాలు మరియు మౌళిక వసతుల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి అన్నారు. ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా హైస్కూల్ నుండి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి శాంతి నగర్ కాలనీలో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఫించన్ 3000వేల నుండి 4000వేలకు ఫించన్ పెంచడం, వికలాంగులకు 3000 వేల నుండి 6000వేలకు పెంచిన ఘనత మన కూటమి ప్రభుత్వానిదేనని ఎక్కడైనా రోడ్లకు గుంతలు లేకుండా ఉండే విధంగా చేశామని తెలిపారు. అనంతరం ఇంటింటి వద్దకు ప్రజల వద్దకు వెళ్లి తమ ప్రభుత్వం గురించి ఏమైనా సమస్యలుంటే తెలపాలని తెలిపారు. మూలే నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ మా ప్రభుత్వం వచ్చినప్పటి నుండి కార్యకర్తలకు, నాయకులకు ప్రతి ఒక్కరికి రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ద్వార అందరికీ ఉపాధి కల్పిస్తున్నామని గతంలో బి.సి జనార్ధన్ రెడ్డి రామ్‌కో సిమెంట్‌తో చర్చించి భూములు కోల్పోయిన రైతులకు ప్రతి ఒక్కరికి దాదాపు 33కోట్ల రూపాయలు రైతులకు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల రామేశ్వర రెడ్డి, నాగేశ్వర రెడ్డి, రామేశ్వర రెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మెన్ కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, బిజ్జం భాస్కర్ రెడ్డి, అందె రాము, ఉలవల నరసింహుడు, కమ్మవారిపల్లె వెంకటరామిరెడ్డి, నిమ్మకాయల దస్తగిరి, విజయ్, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ ప్రసాద రెడ్డి, పంచాయితీ సెక్రెటరీ వెంకటేష్ ఇటిక్యాల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ చెరువు పై ట్రిబ్యునల్ తీర్పు హర్షణీయం

**– డి విష్ణువర్ధన్ రెడ్డి, డిసిసిబి ఛైర్మెన్**



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా బి తాండ్రపాడు గ్రామంలో ఉన్న గంగమ్మ చెరువు పూడ్చి వేతలను తొలగించి చెరువును పునరుద్ధరించాలంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (మద్రాసు బెంచ్) ఇచ్చిన తీర్పు హర్షణీయమని కర్నూలు డిసిసిబి చైర్మన్, తెదేపా సీనియర్ నాయకుడు డి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బి తాండ్రపాడు గ్రామలలో నలుగురు ప్రైవేటు వ్యక్తులు గంగమ్మ చెరువును అక్రమంగా పూడ్చివేసి నీటి నిల్వ సామర్థ్యాన్ని తగ్గించడంపై 2021లో అప్పటి కర్నూలు మాజీ ఎంపిపి డి రాజవర్ధన్ రెడ్డి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వద్ద పిటిషన్ దాఖలు చేశారన్నారు. సుదీర్ఘంగా విచారించిన ట్రిబ్యునల్ సర్వే నెంబర్ 81/1, 299లో సుమారు 12ఎకరాల భూమి చెరువు ముంపు ప్రాంతంలోకి వస్తుందని నిర్ధారించిందన్నారు. అందువల్ల ఆ భూమిలో జరిగిన అక్రమ పూడ్చివేతలను తొలగించి, మట్టిని పూర్తిగా తొలగించి చెరువును పూర్తి విస్తీర్ణంలో పునరుద్ధరించి పరిరక్షించాలని కోర్టు ఆదేశించిందన్నారు. ఈ కేసు విచారణ దశలో ఉండగానే డి రాజవర్ధన్ రెడ్డి కారు ప్రమాదంలో మరణించారన్నారు. ఆయన మరణాంతరం విష్ణువర్ధన్ రెడ్డి ఇంప్లీడ్ అయ్యి కేసును కొనసాగించి విజయం సాధించారు. పిటీషనర్ తరుపున కోర్టులో కర్నూలుకు చెందిన న్యాయవాది బి మోహనకృష్ణ, సాయి సత్యలు వాదనలు వినిపించారు. జూన్ 10న వాదనలు ముగియగా ట్రిబ్యునల్ తీర్పును రిజర్వు చేసి శుక్రవారం తీర్పును వెలువరించింది. ఈ తీర్పులో చెరువు పరిరక్షణకు న్యాయపరంగా బలమైన ప్రాతిపాదిక ఏర్పడినట్లు భావిస్తున్నానని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గంగమ్మ చెరువు ప్రకృతి పరిరక్షణకు, భవిష్యత్తు తరాల నీటి భద్రతకు ఎంతో ఉపయోగకరమని ఆయన కొనియాడారు.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించండి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న మంత్రి ఫరూక్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ పాఠశా లల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం పంపిణీలో ప్రభుత్వ మెనూ పాటించి నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల అబాండంతాం డా (సుగాలిమెట్ట) వద్ద ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంత్రి సందర్శించారు. విద్యార్థులను ఆప్యాయంగా పలకరించి ముచ్చటించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి భోజనాన్ని రుచి చూసి నాణ్యత ప్రమాణాన్ని చూశారు. నిర్వాహకులు వంట వండే ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని మెనూ ప్రకారం రుచి గల ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని అన్నారు. అలాగే తల్లికి వందనం పథకం నిధులు తల్లుల ఖాతాల్లో జమ అవుతున్నాయా లేదా అని తల్లులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు, డ్రస్సుల నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. అన్నంతోపాటు గుడ్డు, చిక్కి అందించకపోవడంతో విద్యాశాఖ అధికారులను సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అన్నారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్, ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి, అబాండం తాండా టీడీపీ అద్యక్షులు, నంద్యాల మార్కెట్ యార్డు డైరెక్టర్, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామినాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో, నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ హరిబాబు, నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, శివనాగిరెడ్డి, కేసీ కెనాల్ చైర్మన్ చాబోలి ఇలియాస్, సర్పంచ్ నారాయణ, గోవింద నాయుడు, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

**మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ**



ఇంటింటికి కార్యక్రమంలో పాల్గొన్న కోట్ల సుజాతమ్మ

**డోన్, మేజర్‌న్యూస్ః** సుపరిపాలనలో ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 25వ వార్డు, జంగాల కాలనీలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ఆదేశాలనుసారం మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం గడిచిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొహర్రం పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

**– జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** మొహరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం జిల్లా ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించి గొడవలకు దిగితే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. గ్రామ పెద్దలు, చిన్న, పెద్ద తేడా లేకుండ ఉత్తేజభరితంగా జరుపుకునే ఈ వేడుకలలో అల్లర్లకు తావుండరాదన్నారు. అందరు సోదరభావంతో మెలగాలని సూచించారు. చిన్న సెరిగేసు, పెద్ద సెరిగేసు, జలధి కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ముగిసే విధంగా సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. చట్టవిరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మొహరం వేడుకలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు.

# క్లస్టర్ యూనివర్సిటీ 4 సెమిస్టర్ పీజీ ఫలితాలు విడుదల

**– వీసీ ఆచార్య వి. వెంకట బసవరావు**



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** క్లస్టర్ యూనివర్సిటీ 4సెమిస్టర్ పీజీ ఫలితాలు రాయలసీమ యూనివర్సిటీ వీసీ, క్లస్టర్ యూనివర్సిటీ ఇంచార్జ వీసీ ఆచార్య వి. వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు శుక్రవారం విడుదల చేశారు. ఈ పరీక్షలు ఏప్రిల్ 15నుంచి 19వరకు నిర్వహించామని మొత్తం 51మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 51మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని క్లస్టర్ యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కో నాగరాజ్ శెట్టి తెలిపారు. 100శాతం యూనివర్సిటీ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సమావేశంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.